# నిరంతరం దైవచింతన చేసేవారిని ఏ చింతలూ బాధించవు

ప్రేమస్వరూపులారా!

'విద్య' అనగా లౌకికమైన చదువు అని మీరు భావిస్తున్నారు. కాదు, కాదు. విద్య అనేది హృదయానికి సంబంధించినది. హృదయమునుండి వచ్చే విద్య ఎప్పటికీ చలించేటటువంటిది కాదు, మరుగున పడేటటువంటిది కాదు. అదియే ఆత్మవిద్య. అదియే నిజమైన విద్య. కాని, ఈనాడు లోకములో తెలివితేటలే ముఖ్యమని భావిస్తున్నారు, కొందరు. తెలివి తేటలుండియు విద్య లేకుండిన ప్రయోజనమేమిటి! అటువంటివాడు కేవలం ఒక మూర్ఖుడనే చెప్పవచ్చును.

ఈనాటి విద్యార్థులలో తెలివితేటలు పెరుగుతూ వచ్చాయిగాని, విద్యయొక్క ప్రమాణములు తరుగుతూ వస్తున్నాయి. మీరు ఎక్కడైనా విద్యార్థులను చూడండి, ఏవో ఫారిన్‌నుండి వచ్చిన పేపర్లనో, మేగజైన్లనో చదువుతుంటారుగాని, తమ పాఠ్య పుస్తకాలపైన వాళ్ళు అంతగా శ్రద్ధచూపరు; తమ పద్ధతులను గురించి, సంప్రదాయములను గురించి ఏమాత్రం యోచించరు. 'ఫలానా రచయిత ఫలానా పుస్తకం రాశాడు, ఎంత గొప్పగా ఉందో!' అంటారు. ఇలాంటి విషయాల పైన చర్చలు, వాదోపవాదాలు చేస్తారుగాని, తమ పాఠ్యపుస్తకాలలో ఏమి ఉన్నదో, తాము చదువవలసిన విషయాలేమిటో, తాము నేర్చుకోవలసిన పద్ధతులేమిటో అన్నీ మరచిపోతున్నారు. ఈ ఆధునిక యుగములో ఈవిధమైన తెలివితేటలు పెంచుకొంటూ విద్యయొక్క విశిష్టతను విస్మరిస్తున్నారు.

sri sathyasai vachanamrutam

తేదీ 28.9.2006, దసరా ఉత్సవాలు, సాయికుల్వంత్ హాలు

**భగవంతునితో తాదాత్మ్యం చెందడమే ఆనందము**

వ్రేపల్లెయందున్న స్త్రీలు ప్రతి రోజు సాయంకాలం యశోద, నందుల ఇంటికి వెళ్లి దీపం ముట్టించుకునే వారు. అది ఆనాటి సాంప్రదాయం. గొప్పవారి ఇంటి నుండి దీపమును తమ ఇంటికి తీసికొనిపోతే తాము కూడా గొప్పవార మవుతామని వారి ఆశ. ఇప్పటికి కూడను పల్లెలయందు ఇటువంటి వాడుక ఉన్నది; శ్రీమంతుల ఇంటికి వెళ్లి వాళ్ల ఇంటి ముందు పెట్టిన దీపముతో తమ దీపమును వెలిగించుకొని ఇంటికి తీసికొని వెళతారు. అయితే, వ్రేపల్లెలో కొందరు అత్తలు తమ కోడళ్లను యశోద ఇంటికి వెళ్లనిచ్చేవారు కాదు. అక్కడ కృష్ణుణ్ణి చూసి వీరు పిచ్చివారివలె అతనివెంట తిరుగుతారేమోనని వారికి భయం. "మన ఇంటిలో దీపము లేదా? వారింటికి వెళ్ళి దీపము ఎందుకు వెలిగించుకోవాలి?" అని కోడళ్లను మందలించేవారు. నీళ్లు తెచ్చుకోవడానికి బావిదగ్గర చేరినప్పుడు ఆడవాళ్లంతా కృష్ణునిగురించే ముచ్చటించుకొనేవారు. ఆ గ్రామమునకు ఒక క్రొత్త కోడలు వచ్చింది. ఆమె పేరు సుగుణ. కృష్ణునియొక్క లీలలగురించి ఆమె ఎంతగానో వినియున్నది. తన అత్తగారికి, భర్తగారికి చెప్పలేదుగాని, ఎలాగైనా కృష్ణుణ్ణి దర్శించుకోవాలనే కోరిక ఆమె మనస్సులో గాఢంగా నాటుకొనిపోయింది. తన కోరికను ఎంతో గోప్యంగా, ఎంతో గుట్టుగా పెట్టుకొన్నది. కాని, సత్యమును దాచిపెట్టుటకుగాని, అణచిపెట్టుటకుగాని, మూసిపెట్టుటకుగాని సాధ్యం కాదు. ఆ క్రొత్త కోడలు కృష్ణునిపట్ల తనకుగల భక్తిని ఎంత గుట్టుగా పెట్టుకొన్నదో అది అంత రట్టయిపోయింది. ఆమె యశోద ఇంటికి వెళ్లి 'కృష్ణా! కృష్ణా!' అని తలుచుకుంటూ దీపం అంటించుకొనే సమయంలో ఆ దీపంలో కృష్ణుడు కనిపించాడు. ఆ తన్మయత్వంలో ఆమె దీపంలో చేయి పెట్టింది. కాని, ఆమెకు చేయి కాలుతున్నదన్న ధ్యాసే లేదు. ఇంతలో యశోద బయటికి వచ్చి సుగుణ చేయి పట్టుకుంది. "ఏమమ్మా! నిద్రపోతున్నావా? చెయ్యి అంతా మాడి పోతున్నది. నీకు బాధ తెలియడం లేదా?" అని అడిగింది. "తల్లీ! జ్యోతిలో కృష్ణుడు దర్శనమిచ్చాడు. కృష్ణుని చూస్తూ నా దేహాన్ని నేను మరచిపోయాను", అన్నది సుగుణ. ఆ మాట విన్నారు, గోపికలు. ఎంతో ఆనందంగా వీధుల్లో డ్యాన్సు చేసుకుంటూ, పాట పాడుకుంటూ వెళ్లారు. ఏమని?

sri sathyasai vachanamrutam

**తేదీ 28.9.2006, దసరా ఉత్సవాలు, సాయికుల్వంత్ హాలు**

**"సుగుణకు కనిపించెనంట**
**మన సుగుణకు కనిపించెనంట**
**నందుని ఇంట గోపాలుడంట**
**దీపాన కనిపించెనంట!**
**అదే వ్రేలికి తగిలిన మంట"**

ఈవిధంగా దైవచింతనచేత మన దుఃఖములను, కష్టముల నన్నిటినీ మరచిపోయి ఎంతో ఆనందాన్ని అనుభవించవచ్చును. అనాదికాలమునుండి భక్తులు దైవచింతనద్వారా ఆనందాన్ని అనుభవిస్తూ, ప్రచార ప్రబోధలు సల్పుతూ వచ్చారు. మీరుకూడను మీకు ఎలాంటి కష్టములు వచ్చినప్పటికీ, ఎలాంటి బాధలు సంభవించినప్పటికీ దైవంపైన భక్తి, విశ్వాసములు పెట్టుకొని ధైర్యంగా వాటిని ఎదుర్కొని సాధిస్తూ రావాలి. దైవచింతన చేస్తూ వుంటే ఏ చింతలుకూడా మనలో ప్రవేశించవు. ఏ కష్టముగాని, నష్టముగాని, ప్రవేశించుటకు వీలుకాదు. Happiness is union with God. దైవంతో కూడినప్పుడు ఏ బాధలూ మీకు కనిపించవు. దేహరీతిగా ఏవో కొన్ని బాధలు ఉండవచ్చును; మానసికంగా ఏవో కొన్ని చింతలు ఉండవచ్చును. ఈ మనస్సును, దేహమును పవిత్రమైన ఆత్మ తత్త్వంతో చేర్చకుండా చూచుకోవాలి. అప్పుడు మీకెట్టి బాధలూ సంభవించవు. ఇదే నవరాత్రులు అందించే సత్యమైన బోధ. ప్రతి దినం ఎన్నియో చింతలు కలుగుతుంటాయి, ఎన్నియో విషయాలు మన మనస్సును చేరుతుంటాయి. 'ఇవన్నీ ఎవరివోగాని నావి కావు' అనే భావనతో వాటిని అలక్ష్యం చేయాలి.

**కర్మయే సుఖదుఃఖములకు కారణం**

మనము కర్మాచరణను ఏమాత్రం విడిచిపెట్ట కూడదు. "కర్మణ్యేవాధికార స్తే మా ఫలేషు కదా చన..." అని భగవద్గీత కూడా బోధిస్తున్నది.

**కర్మమున పుట్టు జంతువు**
**కర్మముననె వృద్ధి పొంది కర్మమున చనున్**
**కర్మయె నరునకు దైవము**

sri sathyasai vachanamrutam

తేదీ 28.9.2006, దసరా ఉత్సవాలు, సాయికుల్వంత్ హాలు

## కర్మయే సుఖదుఃఖములకు కారణమిలలో!

కనుక, ఎవరో మనలను బాధలకు గురి చేస్తున్నారని మనము భావించరాదు. ఎవరివల్లనో మనకు బాధలు సంభవిస్తున్నాయని వారిని నిందించరాదు. మన కష్టనష్టములు వేరొకరివల్ల సంభవించినవి కావు. మనం అనుభవించే సుఖ దుఃఖములన్నింటికీ మన కర్మలే మూలకారణం. మంచిని చేసి చెడ్డను అనుభవించలేము. అట్లే, చెడ్డను చేసి మంచిని పొందలేము. చెడ్డను చేసినవాడు చెడ్డనే అనుభవిస్తాడు; మంచిని చేసినవాడు మంచినే అనుభవిస్తాడు. కనుకనే, మంచినే చేయి, మంచినే చూడు, మంచిగా ఉండు. దైవసాన్నిధ్యానికి మార్గమిదే! మంచిభావాలను ఉద్భవింపజేసుకొని, మంచికర్మలను ఆచరిస్తే మనం తప్పక మంచి ఫలితాలనే అనుభవిస్తాము. మన పెద్దలందరుకూడను ప్రాచీన సంప్రదాయాలను ఆచరిస్తూ, సుఖసంతోషాలను అనుభవిస్తూ వచ్చారు. కాని, ఈనాటి పిల్లలు పెద్దలు అనుసరించిన మార్గాన్ని, వాళ్లు ఆచరించిన పవిత్ర కర్మలను విస్మరించి, ఆధునిక విద్యలను అభ్యసించి అనేకవిధములైన అశాంతికి గురి అవుతున్నారు. అశాంతికి మాత్రమే కాదు, అసంతృప్తికి కూడను లోనవుతున్నారు; అనారోగ్యమునకుకూడను గురి అవుతున్నారు.

మానవునియొక్క అనారోగ్యానికి మూలకారణం అతని సంకల్పములే! అశాంతికి మూలకారణం అతని గుణములే! కనుక, మన ప్రతి విషయంలోనూ మన సంకల్పములు మంచివిగా ఉండాలి. మనము స్వీకరించేవన్నీ పవిత్రమైనవిగా ఉండాలి. ఈ దసరా ఉత్సవాలు మనలో మంచి గుణములను, మంచి అలవాట్లను పెంపొందించేందుకై ఉద్దేశించినవి. ప్రతి దినము చక్కగా స్నానమాచరించి, మన ఇంట్లో పూజ చేసికొని, పవిత్రమైన భోజనం చేసి, పరిశుద్ధమైన జలమును గ్రోలి, పవిత్రమైన వాతావరణములో సంచరిస్తున్నప్పుడు మనము ఎంతో ఆరోగ్యంగాను, ఆనందంగాను ఉంటాము. మన ముఖం తేజస్సుతో కళకళలాడుతుంటుంది. అట్లుగాకుండా, అపవిత్రమైన ఆహారము భుజించి, కలుషితమైన జలమును గ్రోలి, కలుషితమైన గాలిని పీల్చుకుంటూ సంచరిస్తున్నప్పుడు మన ఆరోగ్యం క్షీణించిపోతుంది. అంతేకాదు, మన మానవత్వమునే మరచిపోతాము.



sri sathyasai vachanamrutam

**భక్తుల ఆనందమే నా ఆనందము**

చాలామంది నన్ను చూసి, "స్వామీ! మీ దేహానికి 81 ఏళ్ళు వస్తున్నాయే! అయినా మీరు ఆవిధంగా కనిపించడం లేదే!" అని ఆశ్చర్యపడుతుంటారు. నేను చెబుతుంటాను, "అయ్యా! నేను అపవిత్రమైన ఆహారాన్ని భుజించడం లేదు; కలుషితమైన గాలిని పీల్చడం లేదు. భక్తులయొక్క ప్రార్థనలనే గాలిని నేను తీసుకుంటున్నాను. ఇటువంటి పరిస్థితిలో నా తేజస్సు ఎక్కడికి పోతుంది!"

నాకెట్టి జబ్బూ లేదు. నాకెట్టి నొప్పీ లేదు. ఒక పిల్లవాడు చేసిన పొరపాటువల్ల నేను క్రిందపడ్డాను. అప్పుడు నా కాలు విరిగింది. అందువల్ల, నడవడానికి కొంత ఇబ్బందిగా ఉన్నది. అయితే, నాకు నడవాలన్న ఇష్టముకూడా లేదు. ఎట్లాగైతేనేమి, వస్తున్నాను, భక్తులను చూస్తున్నాను. ఇందులో కష్ట మేమున్నది! బాధ ఏమున్నది! భక్తులను ఆనందపరచినప్పుడు నాకు కూడా ఎంతో ఆనందము కలుగుతుంది; బాధ, నొప్పి, కష్టము అనేవి రానే రావు. నాకెప్పుడూ ఆనందమే! ఆనందమే నా ఆహారము. నా ఆనందముకంటే మించినటువంటి ఆనందము ఎక్కడా లేదు. ఏ కారణంచేతనైనా ఒక దినము నేను సభకు రావడం కాస్త ఆలస్యమైతే, 'అయ్యో పాపం, భక్తులు ఎంత వెయిట్ చేస్తుంటారో! ఎంత విచారిస్తుంటారో!' అని చాలా బాధపడుతుంటాను. ఎంత టైమ్ అయినా సరే, నేను బయల్దేరి వస్తుంటాను. కాబట్టి, నాకు బాధ అనిగాని, నొప్పి అనిగాని మీరు భావించకండి. ఇట్టి సత్యమైన ఆనందాన్ని మీకు చూపించే నిమిత్తమై నేనీనాడు ఈవిషయాలు మీకు చెబుతున్నాను. నేను ఎప్పుడూ ఆనందంగానే ఉంటాను. మీరుకూడా ఎప్పుడూ ఆనందంగానే ఉండాలి.

పాండవులను బాధించడానికి కౌరవులెంతగానో ప్రయత్నించారు. కాని, పాండవులు వారికి ఏమాత్రము లొంగలేదు. కారణమేమిటి? కృష్ణునిపట్ల వారికి గల అచంచలమైన భక్తి, విశ్వాసములే! 'కృష్ణుడే మాకు తోడునీడగా ఉన్నప్పుడు ఎవరెన్ని బాధలు పెట్టినా మాకు భయమెందుకు!' అని వారు భావించారు. అదేవిధముగా, మీరుకూడను సాయి నిరంతరం మీ ఇంట, వెంట, జంట ఉన్నాడని విశ్వసించండి. ఈ బాధలు, కష్టములు, విచారములతో సంబంధము పెట్టుకోకండి. ఆకాశంలో మేఘాలు వస్తుంటాయి, పోతుంటాయి. ఏదీ

sri sathyasaivachanamrutam

శాశ్వతంగా సూర్యునికి అడ్డు నిలువలేదు. సాధారణంగా వర్షాకాలంలోనే మేఘాలు సూర్యునికి అడ్డువస్తుంటాయి. అదేవిధంగా, మనస్సు చంచలంగా ఉన్నప్పుడే మనకు అనేక బాధలు సంభవిస్తుంటాయి. మన మనస్సు స్థిరంగా, దృఢంగా ఉన్నప్పుడు 'మేఘాలు' అడ్డురావడానికి వీలే లేదు. కనుక, మీ మనస్సును నిర్మలంగా, నిశ్చలంగా ఉంచుకోండి. ధైర్య, సాహసాలను పోషించుకోండి.

**దైవత్వంపై స్థిరంగా దృష్టి నిలుపుకోండి!**

ఈనాడు మానవ జీవితము ఏవిధంగా ఉన్నది? ఈ జగత్తనే నాటక రంగములో చేరి కామక్రోధములతో కూడిన పాటలు పాడుకుంటూ, అహంకార, మద, మాత్సర్యములతో కూడిన ఆటలు ఆడుకుంటూ జీవిత నాటకాన్ని సాగిస్తున్నారు. దీనిని చూసి చాలామంది, 'చాలా బాగుంది' అని మురిసి పోతున్నారు. కాని, కొందరు మాత్రం దీనిని విశ్వసించక, ఈ 'యాక్షన్'ను చూసి భ్రమించక, దీనివల్ల వచ్చే 'రియాక్షన్, రిఫ్లెక్షన్, రీసౌండ్'లకు ఏమాత్రం భయపడక, 'రియాలిటీ'పై తమ దృష్టిని నిలుపుకుంటున్నారు. ఆ 'రియాలిటీ'యే దైవత్వము. అది చలించదు, భ్రమించదు; కంటికి కనిపించదు. అట్టి 'రియాలిటీ'ని మనం గట్టిగా పట్టుకోవాలి. 'రియాలిటీ'ని ఆధారం చేసుకున్నప్పుడు మన తలంపులు, మన ప్రవర్తన, మన పలుకులు – అన్నీ పవిత్రంగానే ఉంటాయి. కనుక, విద్యార్థులారా! 'కదలిపోయే మేఘాల'ను చూసి మీరు భయపడకండి, ఏమాత్రం చింతించకండి. మీ కర్తవ్యాన్ని మీరు చక్కగా నిర్వర్తించండి. మీ తల్లిదండ్రులు మీనుండి ఏమి ఆశిస్తున్నారో దానిని నెరవేర్చండి. మీ తల్లిదండ్రులు కొండంత ఆశపెట్టుకొని మిమ్మల్ని ఇక్కడికి పంపించారు. వారి అభీష్టాలకు విరుద్ధంగా మీరు ప్రవర్తిస్తే వారు ఎంత బాధపడతారో యోచించండి. మీరు మీ తల్లిదండ్రులను కష్టపెడితే స్వామినికూడా కష్టపెట్టినవారవుతారు.

**"త్వమేవ మాతాచ పితా త్వమేవ**
**త్వమేవ బంధుశ్చ సఖా త్వమేవ**
**త్వమేవ విద్యా ద్రవిణం త్వమేవ**
**త్వమేవ సర్వం మమ దేవ దేవ"**

srisathyasaivachanamrutam

అని మీరు దేవుని ప్రార్థిస్తున్నారు కదా! దేవునికి, తల్లిదండ్రులకి భేదము లేదు. కనుక, తల్లిదండ్రులను ఆనందపెట్టండి. స్వామి ఎప్పుడూ ఆనందంగానే ఉంటాడు. ఈ సత్యాన్ని మీ హృదయంలో భద్రం చేసుకోండి.

**ప్రహ్లాదుని ఆదర్శం**

ఒకానొక సమయంలో ప్రహ్లాదుణ్ణి తండ్రి హిరణ్య కశిపుడు దగ్గరకు పిలిచి, "నాయనా! నిన్ను గురువుల దగ్గర చేర్పించాను. నీకు చక్కని బోధలు చేయమని వారికి చెప్పాను. వారు నీకేమి బోధిస్తున్నారు?" అని అడిగాడు. అప్పుడు ప్రహ్లాదుడు చెప్పాడు:

**"చదివించిరి నను గురువులు**
**చదివితి ధర్మార్థ ముఖ్య శాస్త్రంబులు నే**
**జదివినవి గలవు పెక్కులు**
**చదువులలో మర్మమెల్ల జదివితి దండ్రీ!"**

హిరణ్యకశిపుడు ఎంతో ఆనందించి, "ఏదీ, ఆ మర్మ మేమిటో చెప్పు నాయనా!" అన్నాడు. ప్రహ్లాదుడు, "తండ్రీ! మనము చూసేది, అనుభవించేది అంతా అనిత్యము, అశాశ్వతము. దైవమే సత్యము", అన్నాడు. తండ్రికి కోపం వచ్చింది. ప్రహ్లాదుణ్ణి మెడపట్టి క్రిందికి నెట్టాడు. "తండ్రి ఆజ్ఞను ధిక్కరించినవాడు నా కళ్ళ ఎదుట ఉండటానికి వీల్లేదు. తక్షణమే వీనిని తీసుకు వెళ్లి సముద్రంలో పడేయండి", అని ఆదేశించాడు. రాక్షసులు ప్రహ్లాదుణ్ణి తీసుకువెళ్ళి కొండపైనుండి సముద్రంలోకి నెట్టారు. అప్పుడుకూడను ప్రహ్లాదుడు, "నారాయణ, నారాయణ' అని స్మరిస్తూనే ఉన్నాడు. శ్రీమన్నారాయణుడు సముద్రంలోనుంచి బయటికి వచ్చి ప్రహ్లాదుణ్ణి పట్టుకుని కాపాడినాడు. 'వీడింకా చావలేదా' అని హిరణ్యకశిపుడు కోపోద్రిక్తుడై అతనిని అగ్నిగుండంలో పడద్రోయించాడు. తక్షణమే ఆ అగ్ని కూడా ఆరిపోయింది. అతనిని దహించడానికి అగ్నికూడా ఇష్టపడలేదు. దీని అంతరార్థ మేమిటి? మంచికి చెడు అడ్డు తగులుతూనే ఉంటుంది. కాని, చెడు సంభవించినప్పటికీ అది మంచివారిని బాధించదు. పళ్ళున్న చెట్టుకే రాళ్ల దెబ్బలు పడుతుంటాయి. అదేవిధముగా, మంచివారికి ఇలాంటి కష్టములు ఎదురవుతుంటాయి.

sri sathyasai vachanamrutam

ఎన్ని వచ్చినప్పటికీ వాటిని భగవద్విశ్వాసముతో ఎదుర్కోవాలి.

**దుర్గ, లక్ష్మి, సరస్వతి మీ హృదయంలోనే ఉన్నారు**

విద్యార్థులారా! మీ తల్లిదండ్రులయొక్క ఆజ్ఞను, దైవముయొక్క ఆజ్ఞను మీరు తు.చ. తప్పకుండా అనుసరించండి. సత్ప్రవర్తనను అలవర్చుకోండి. అంతా మీకు మంచే జరుగుతుంది. ఏదీ మిమ్మల్ని బాధించదు. ఏదీ మిమ్మల్ని కష్టపెట్టదు. ఇలాంటి సత్యవాక్యములను ఆచరణలో పెట్టే నిమిత్తమై ఈ దసరా ఉత్సవాలలో దుర్గ, లక్ష్మి, సరస్వతి ముగ్గురినీ ఆరాధిస్తున్నారు. దుర్గ అనగా ఎవరు? ఏదో భయంకరమైన స్వరూపము కల్గినది కాదు. ఆమె మిమ్మల్ని రక్షించేటటువంటి మహాదేవత. లక్ష్మి అనగా ఎవరు? ఆమె సకలైశ్వర్య స్వరూపిణి. ఇక, సరస్వతి వాగ్దేవత. మంచి తలంపులు, మంచి వాక్కులు, మంచి ప్రవర్తన ఈ మూడూ లక్ష్మి, సరస్వతి, దుర్గలయొక్క తత్త్వములను ప్రకటిస్తున్నాయి. మీకు ఎవరు మంచిని బోధిస్తారో వాళ్లే సరస్వతీ స్వరూపులు. ఎవరు మీకు చెడును బోధిస్తారో వాళ్లే అసురులు. అట్టి అసురులనే దుర్గాదేవి సంహారం చేసింది. దుర్గ, లక్ష్మి, సరస్వతి – వీరు మానవునికిగల ముగ్గురు మాతలు. ఈ ముగ్గురూ వేరుగా లేరు; మీ హృదయంలోనే ఉన్నారు; మీరు నిజమైన మానవులుగా జీవించాలని బోధిస్తున్నారు. ఈవిధమైన మంచి విషయాలను మీరు ఆచరణలో పెట్టి, అభివృద్ధికి వచ్చి ఆదర్శాన్ని నిరూపించాలి. భారతీయ విద్య చాలా గొప్పదనే సత్యాన్ని మీరు ప్రపంచానికంతటికీ చాటాలి. ఈ ఆధునిక ప్రపంచంలో అనేకమంది దుర్విద్యలను బోధిస్తున్నారు. వాటిని మీరు త్యజించాలి. 'ఇది నా హృదయానికి మంచిదా, కాదా?' అని విచారణ చేయండి. మీ హృదయానికి నచ్చకపోయినప్పుడు దానిని ప్రక్కకు నెట్టేయండి. మీరు హృదయానికి సంతృప్తికరంగా నడుచుకున్నప్పుడే మీ జీవితము సుఖశాంతులతో వర్ధిల్లుతుంది. నిరంతరము నామస్మరణ చేయండి.

**(తేదీ 28.9.2006, దసరా ఉత్సవాలు, సాయికుల్వంత్ హాలు)**

sri sathyasaivacharamrutam